క్లుప్తంగా

రేపు కంటివైద్య శిబిరం

దామరగిద్ద: మండల కేంద్రంలోని రెయిన్‌బో స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సక్షమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. శంకర్ కంటి ఆస్పత్రి హైదరాబాద్ వైద్యులతో సక్షమ్–తెలంగాణ అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే శిబిరాన్ని కంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



ఊట్కూరు: పెద్దపొర్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం నారాయణపేట డీపో మేనేజర్ లావణ్యకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ.. పెద్దపొర్ల గ్రామం నుంచి నారాయణపేట, మక్తల్ పట్టణాలకు చదువుకునేందుకు సుమారు 120మంది విద్యార్థులు నిత్యం కాలిబాటన ఆటోల్లో వెళ్తున్నారని తెలిపారు. గతంలో ఆర్టీసీ అధికారులు బస్సును నడిపిస్తామని చెప్పి నేటికి ఏడాది దాటిందని, వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని మేనేజర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, రమేష్, వరప్రసాద్, అంజప్ప పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



మాగనూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మండల వైద్యాధికారిణి నాగజ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె వైద్యసిబ్బందితో కలిసి పలు వార్డుల్లో పర్యటించి డ్రై డే గురించి అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. నిల్వనీరు ఉంచుకోవద్దని, హౌజ్‌లలో పెరుకున్న నాచు తొలగించి బ్లీచింగ్ ఫౌడర్ చల్లుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుధా, ఆశాకార్యకర్తలు రేణుక, సరిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ



మరికల్: భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ముఖద్వారానికి శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్ భూమిపూజ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఆలయ ఆవరణలో చేపట్టిన లక్ష బిల్వార్చన కార్యక్రమంలో దాతలు ముందుకొచ్చి వారికి తోచిన విధంగా చందాలు రాయగా రూ.5 50 లక్షలు జమచేశారు. ముఖద్వార పనులు వెంటనే ప్రారంభించనున్నారు. దాతల సహకారంతో త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వీరన్న, బసంత్, శివకుమార్, అయ్యప్ప పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఉత్సవాలు



మద్దూరు: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముష్టి నర్సింహులు శుక్రవారం తెలిపారు. ఉదయం జల్ది ఉరేగింపులో స్వామివారి శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనే ప్రతి ఒక్కరికి టోపి, హనుమాన్ జెండా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రవచన వేదిక వద్ద తెలుగు ఉపన్యాసకులు సిద్ధిలింగయ్యస్వామి, పాలమూరు విభాగ్ ప్రచారకులు దేవేంద్రరాజుల హిందుధర్మంపై ధార్మిక ప్రసంగం, అనంతరం ఆలయ కమిటీ సభ్యులచే అన్నదానం ఉంటుందన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మరికల్: మండల కేంద్రంలోని ఆలయంలో శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు ఆలయంలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



అవుసలోనిపల్లి శివారులో కల్వర్టుపై పారుతున్న నీరు (ఫైల్)



పగిడిమారి–అమీన్‌పూర్ గ్రామాల మధ్య కొనసాగుతున్న పనులు

మరమ్మతుకు నోచుకోని కల్వర్టులు

ఊట్కూర్: మండలంలో కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల నాటివి కావడంతో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలంలో భారీ వర్షాలతో కల్వర్టుపై వరదనీరు పారడంతో పలు గ్రామాలకు రాకపోలు నిలిచిపోతున్నాయి. కల్వర్టుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణిస్తున్నారు. పులిమామిడి శివారులో చెరువు సమీపంలో కల్వర్టు లోతట్టు ప్రాంతంతో ఉండడంతో వరదనీరు వారం రోజులపాటు పారింది. అవ్వులోనిపల్లి, అమీన్‌పూర్, మల్లెపల్లి, బిజ్వార్, పగిడిమారి, సామనూర్ తదితర గ్రామాల సమీపంలో కల్వర్టులు లోతట్టుప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో రోడ్లపై వరదనీరు పారుతున్నాయి. దీంతో ఆయాగ్రామాలకు వరదనీరు తగ్గే వరకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

■ పగిడిమారి–అమీన్‌పూర్ గ్రామాల మధ్య చికటివాగుపై ఆరు నెలలుగా కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి లోతట్టు ఉన్న ప్రాంతాలలో కల్వర్టులను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

■ ఈ విషయమై ఏఈ జగత్‌చంద్రకు వివరణ కోరగా.. తను ఇటీవల బదిలీపై వచ్చానని, గతంలో కల్వర్టుల మరమ్మతుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.



సామనూర్ శివారులో ఇలా..



ఊట్కూర్ శివారులో దెబ్బతిన్న కల్వర్టు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నారాయణపేట రూరల్: శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారు ప్రజ్ఞా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో హంసవాహిని స్కూల్ విద్యార్థులు పాల్గొని జిల్లాస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యాసరచన పోటీలో దీపిక (అమీన్ పూర్) ప్రథమ, నితిన్ (వత్తుగుండ్ల) ద్వితీయ, చిత్రలేఖన పోటీలో ఎల్లప్ప (భైరంకొండ) ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు. వీరిని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని వేర్వేరుగా శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక అంశాలు తెలియజేయాలని, సాంస్కృతిక పోటీల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ఆయా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ్ బట్టడ్, కౌన్సిలర్ సలీం, మాజీ ఎంపీపీ సదా శివరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ నాయకులు గందె చంద్రకాంత్, డీఈఓ కార్యాలయ సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు సుజాత, నమ్రత పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

మద్దూరు: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, ఎంపీఓ గోపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని వివరించారు. నవ సమాజాన్ని నిర్మించేది ఉపాధ్యాయులేనని సూచించారు. ఇప్పటివరకు ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు యశ్వంత్, వెంకటప్ప, మహేష్, భీమయ్య, సవితా, బాలాజీ, రఘు, సూర్యప్రకాష్, సుధాకర్, శారద, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యువత రాజకీయాల్లో రాణించాలి

ఊట్కూరు: యువత రాజకీయాల్లో రాణించి ప్రజల సంక్షేమానికి కృషిచేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరారు. శుక్రవారం మండలంలోని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ నర్సింహ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ఊట్కూరు గ్రామానికి చెందిన నర్సింహ జీవనోపాధికోసం హైదరాబాద్‌లోని బొల్లారం పట్టణానికి వెళ్లి అక్కడ కార్పొరేటర్‌గా గెలుపొందడం అభినందనీయమన్నారు. యువకులు రాజకీయాల్లో అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చునని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను చేపట్టిందని ఆయన తెలిపారు. అనంతరం గ్రామస్తులు నర్సింహను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి, శివరామరాజు, మహేష్‌రెడ్డి, లింగం, శంకర్, రవికుమార్, షమీఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ నర్సింహను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

మద్దూరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా సాధికారత కేంద్రం ఆర్థిక నిపుణుడు విజయ్‌కుమార్ మహిళలకు సూచించారు. శుక్రవారం మండలంలోని పోస్ట్ ఆఫీస్‌లో మహిళలకు ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన, జీవన జ్యోతి బీమా పథకం, సురక్ష బీమా యోజన, పథకాలను వివరించారు. కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ ఎస్‌ఓ బాలకిష్టయ్య, సిబ్బంది, శ్రావణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న విజయ్ కుమార్

వంతెన నిర్మించాలి..



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట నుంచి తండాకు వెళ్లే రోడ్డు మధ్యన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తండావాసులు అధికారులను కోరారు. శుక్రవారం వాగును పంచాయతీ శాఖ ఏఈ వెంకటేష్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా పైపులు వేసి రాకపోకలను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు చర్చించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన



కోస్గి: ఇంటింటికెళ్లి ఓటర్లను సరిచూసుకొని అప్‌డేట్ చేయాలని, ఒకే కుటుంబ సభ్యులను ఒకే వార్డులో వచ్చేవిధంగా మార్పులు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పట్టణంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఓ వార్డులో ఉంటున్న వారు ఇంకో వార్డులో ఓటు నమోదు ఉంటుందని, వాటిని కూడా సరిచేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు



మాగనూర్: గత రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయ ఉద్యమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తనదైన ముద్రను వేసిందని జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని వర్క్యూర్, వడ్వాట్ తదితర పాఠశాలలో ఆయన డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామన్ స్కూల్ విధానాన్ని అమలులోకి తేవాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు సరిపడా బోధన, పర్యవేక్షణ సిబ్బందిని నియమించాన్నారు. వివిధ రకాల ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం ఒక డీటీఎఫ్ సంఘానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పరందాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై అవగాహన



నారాయణ పేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఊట్కూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణం రాజు

నారాయణపేట రూరల్: పట్టణ శివారులోని లోకపల్లి లక్ష్మమ్మ జాతర వద్ద షీటీం పోలీసులు జాతరకు వచ్చిన భక్తులకు షీటీం, సైబర్ నేరాలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య మాట్లాడుతూ... మహిళలు, అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురిచేసిన షీటీం పోలీసులకు నంబర్ 8712670398కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఊట్కూరు: మండలంలోని శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఎస్‌ఐ కృష్ణం రాజు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లను ఆసరగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. వివిధ కంపెనీల నుంచి మోసపూరితమైన ఫోన్ చేస్తూ ఓటీపీలను అడుగుతారని చెప్పిన వెంటనే ఖాతాలోని డబ్బులు మొత్తం మాయం అవుతాయన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజనర్సింహ, గ్రామస్తులు జగదీష్‌గౌడ్, మనోహర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

మరికల్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పగుడకుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త ఒక నిబద్ధతతో పని చేయాలని సూచించారు. మండలంలో 17పంచాయతీలు ఉన్నాయని, వీటిలో కనీసం పది గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిపించుకునేలా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్సన్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, సురేందర్, అశోక్‌రెడ్డి, శ్రీరాం, రాజేష్, రఘునాథ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సన్మానం

దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్ద గ్రామనానికి చెందిన కే.చంద్రశేఖర్‌రెడ్డి బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకంపై శుక్రవారం గ్రామంలో బీజేపీ నాయకుల సమక్షంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. గ్రామ పెద్దలు బీకేఎస్ నాయకులు బాల్‌చందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గౌరయ్య, భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యువ నాయకుడు బీజేవైఎం రాష్ట్ర కమిటీలో కార్యవర్గ సభ్యుడిగా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, నారాయణ, మురళి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



సన్మానిస్తున్న గ్రామస్తులు

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మరికల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మహిళా చట్టాలపై డీహెచ్‌ఈడబ్ల్యూ అధికారులు అనిత, రేణుక విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ఆపద వచ్చినప్పుడు తమను తాము ఎలా రక్షించుకోవాలనే విషయాలపై వారికి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోరంజిని, జ్యోతి, స్వాతి, గీత, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని మండల నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ మేరకు.. విద్యార్థులను పాఠ్యాంశంలోని పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోని ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినితో పాఠాలు చదివిస్తున్న నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి

ప్రమాదకరంగా రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని వర్క్యూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షానికి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదకరంగా మారిన పంచాయతీరాజ్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కోతకు గురైన రోడ్డు

వైభవంగా లోకాయపల్లి లక్ష్మమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి దంపతులు

నారాయణపేట రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. అర్చకులు సోమశేఖరస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవా, జల, ఫలచందన పుష్ప మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా మహిళల ఆధ్వర్యంలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సమీపంలోని ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భారీ బందోబస్తు, ఇతర ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, లప్ప అశోక్, దినేష్‌లాహోటీ, కన్న జగదీష్, రాధాకృష్ణ, శశికాంత్, నర్సింహులు, రాంరెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పనుల్లో అలసత్వం వద్దు

అమరచింత: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం చూపితే శాఖాపరమైన చర్యలు తప్పవని డీపీఓ రమణమూర్తి అన్నారు. మండలంలోని సింగంపేటలో శుక్రవారం చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, వీటిని నివారించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ముందుండాలన్నారు.